# వీణాప్రేయసి

'ఉగ్రశ్రీ'

అతను వీణవాయిస్తే యువకుల కుద్రేకం కలుగుతుంది. జను లానంద పారావారంలో జలక్రీడలాడతారు. పలుకులురాని పసిపిల్లల వ్యక్త ధ్వనులు సలుపుతారు. సంగీతజ్ఞానం లేని చచ్చుదద్దమ్మ సహితం శహబాస్ అని తీరతాడు.

వీణే అతనికి సర్వ ప్రపంచం—అంత కన్నా గొప్పది. అతనా వీణనివిడిచి ఉండలేడొక్కక్షణమైనా. బహుశా వీణకూడా అతన్ని విడిచిఉండలేదేమో?

ఉదయం నిద్రనుంచి లేవగానే వీణని ప్రేమ పురస్కరంగా, నిర్మలమైన అభిమానంతో, అమాయకంగా చుంబిస్తాడు. అది చేస్తేనేగాని మరోపని ముట్టడాదినం. అంటాడతను వీ ణ నా ప్రే య సి...వీ ణా ప్రేయసి......

మయూర కోకిలాది విహంగనూలు కూడా గ్రహించవలసిన గానకళ అతని వీణలో ఇమిడిఉంది. ప్రతిదినమూ వస్తూ ఉంటాయ్...పోతూ ఉంటాయ్. కొన్ని అతని ఇంటిపెరటిలోనే గూళ్లు కట్టుకుని ఉన్నాయనడలో అవంతైనా అతిశయోక్తి ఉందనడానికి అవకాశం లేదు—ఆధారం అంతకన్నా లేదు.

అతను తన తీరికలో వీణవాయిస్తూ ఉంటాడు. ప్రజాసమూహానికి ఎడతెరిపి ఉండదు. అతని కీర్తి నాలుగు దిక్కులూ వ్యాపిస్తోంది—వ్యాపించింది.

అతనిప్పుడు భద్రపురం జమీందారు ఆస్థాన గాయకుడయ్యాడు. జమీందారతన్ని పోషిస్తున్నాడు. అందు కతనతనికి కృతజ్ఞుడు—

ఇతని యశస్సు చంద్రపురం ఆస్థానంలోనుంచి ఆజమీందారు కర్ణద్వయంవరకూ తన విశ్వరూపం చూపింది. విచారించాడు తన ఆస్థానంలో అట్టిగాయకుడు లేకపోయినందుకు. చింత అంతులేనిదయింది. అసూయగా మారింది. అపకారం తలపెట్టి అవమానించాలని కబురంపించాడు గాయకుడికి—

వస్తున్నాడు గాయకుడు ఆత్మవిశ్వాసంతో—

మడమలు దిగని గావంచా, పైమీద ఒకవోణీ—అంతే అతని వస్త్రధారణ.—

అడ్డగించారు మంత్రిగారు తమ రాజు గారిని దర్శించేటప్పుడు పాగాచుట్టాలని.

తన్ను పోషించే భద్రపురం రాజుకే తను గౌరవమిస్తాడు, కాని తదితర...

జమీందారు ఒచ్చాడు—

"ఏంటి వికృతస్వరూపం!"

"వేషంలో ఏముంది!" అన్నాడు గాయకుడు.

జమీందారు కరికాలిమంట నెత్తి కెక్కింది.

"సరే! రావచ్చు"

సభ సజీవంగా ఉంది—

గాయకు డలంకరించాడు సభని—

ఛీ! ఛీ! అన్నారు సభాసదులు—

తీశాడు గాయకుడు వీణ. సంపూర్ణంగా ఒక్కసారి స్పృశించాడు. వీణ అర మోడ్పుకందోయితో చూసింది. ఏవేవో జిలిబిలి పలుకులు పలికాడు. వీణ సిగ్గుతో తలవంచుకొంది.

వీణని సంపూర్ణంగా స్వాధీనం చేసుకున్నాడు, వాయిస్తున్నాడు.

సభ్యులానందాశ్చర్యాల్లో ఐక్యమై పోయారు. వారికి ముచ్చెమటలూ పోశే శాయ్. పెదిమలు కదలబోతున్నై.

జమీందారుకి చైతన్యమే లేదు— శిలా విగ్రహమై పోయినాడు—

కళ మార్చేడు గాయకుడు. వీణని తన చేతి వేళ్లతో గట్టిగా బలంగా నొక్కుతున్నాడు.

సభ్యుల్లో వెర్రిచైతన్యం కలిగింది—

వారిలో సంచలనం కలిగింది—కత్తులుమీద చేతులు పడ్డాయ్. ఒకరినొకరు చంపుకోడానికి సిద్ధపడ్డారు.

సంగతి గ్రహించాడు గాయకుడు. నిలుపుచేశాడు వాయిద్యం—

అందరికీ తెలివొచ్చింది—మనస్సుల్లో నొచ్చుకున్నారు.

సభ్యులందరూ శక్తి కలిగినంత పొగిడారు. ఇంతవాడు లేడన్నారు.

జమీందారుకి అసూయతగ్గలేదు. అవమానించాలనే ఉద్దేశం బలీయమయింది.

మార్గం దొరకకుండా ఉంది.

చివరికి అన్నాడు—

"ఇంత గానకళ నీలో ఉన్నందుకు..." సందేహించాడు—

"సందేహం ఒద్దు" అందించాడు మంత్రి.

"నువ్వొక చక్కని స్త్రీవై ఉంటే ఇంకా బాగుండును"

అందుకు గాయకుడు ప్రత్యుత్తర మిచ్చాడు.

"నేనే గాని స్త్రీనై ఉండేటట్టయితే— మీరా సింహాసనంమీద కూర్చుని ఉంటారా? నాకు దాసానుదాసులై నాసేవచేస్తూ, నా పాదాలొత్తుతూ, నా వీణమోస్తూ...

జమీందారు ముఖం జేవురించింది—

సభ ముగిసింది—